తెలంగాణ శాసనసభ
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ
TELANGANA SHASANA SABHA
తెలుగు దినపత్రిక
సంపుటి : 02 సంచిక : 213 | ఎడిటర్ పాలగోని రాజేష్ | 18 శనివారం జనవరి 2025 | పేజీలు 8 వెల 4



స్కిల్ వర్సిటీతో

# టెక్నికల్ సహకారం

## సింగపూర్ యూనివర్సిటీతో ఎంఓయూ- సిఎం రేవంత్ సమక్షంలో కీలక ఒప్పందం

హైదరాబాద్,జనవరి 17 ):
నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయు కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది

2

## దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ


# విస్తరణకు చర్యలు

### జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి

2

### భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,జనవరి17 :
దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ



గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి

# ఇందిరమ్మ ఇండ్లు

- పారదర్శకంగా గ్రామసభల్లో లబ్దిదారుల ఎంపిక
- త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకం
- రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



2



## ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

రంగారెడ్డి,జనవరి 17( కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు

2

# పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

- -కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం
- -విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి -మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

2



## మాజీమంత్రి పొన్నాల నివాసంలో చోరీ

### ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

2





## రేవంత్ ప్రభుత్వ వేధింపులు ఎక్కువయ్యాయి

మాసాబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ విచారణకు వచ్చిన కౌశిక్ రెడ్డి

# ఆరు గ్యారెంటీలని..అర గ్యారెంటీ అమలు

ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు.

ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్లైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవేళ్లలోనే కాదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసిందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హంసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు. ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డలు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్,జనవరి17(ఆర్ఎన్ఎ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర పక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి ,రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ , హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్,జిహెచ్ ఎం సీ కమీషనర్ ఇలంబర్తి, సిఎంఆర్‌వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించు కోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రి సిఎస్ కి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్వో, విఆర్ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు

# మాజీమంత్రి పొన్నాల నివాసంలో చోరీ

హైదరాబాద్,జనవరి17

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఫిలింనగర్‌లోని పొన్నాల ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు భారీగా అభరణాలు అపహరణకు గురయ్యాయి. పొన్నాల సతీమణి అరుణా దేవి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. పొన్నాల ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే ఈ చోరీ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.సంఘటన జరిగిన సమయంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, కుటుంబసభ్యులు ఎవరూ ఇంట్లో లేదని తెలుస్తోంది. దొంగతనం జరిగిన రోజున పొన్నాల జనగాం జిల్లాలో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్టిక్ర్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్–2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్టిక్ర్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్టిక్ర్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# మంచు బ్రదర్స్ ట్వీట్ వార్

హైదరాబాద్,జనవరి17

:మంచు బ్రదర్స్ మరోసారి మీడియాకెక్కారు. సోషల్ మీడియా వేదికగా ఒకరినొకరు తిట్టుకున్నారు. ముందుగా మంచు విష్ణు ఎక్స్(ట్విట్టర్)లో ఓ సినిమా డైలాగ్ ను ట్వీట్ చేశాడు. పరోక్షంగా తననే అన్నట్లు భావించిన మనోజ్.. వెంటనే ఎక్స్ లో మరో కౌంటర్ ట్వీట్ పడేశాడు. అసలు వీరిద్దరు ఎక్స్ వేదికగా ఏమని తిట్టుకున్నారో చూద్దాం..ముందుగా ట్వీట్ వార్ ను మంచు విష్ణు స్టార్ట్ చేశాడు. 'సింహం అవ్వాలని ప్రతి కుక్కకు ఉంటుంది.. కానీ వీధిలో మొరగటానికి, అడవిలో గర్జించడానికి ఉన్న తేడా కనీసం వచ్చే జన్మలోనైనా తెలుసుకుంటావు' అని తన తండ్రి 'రౌడీ' సినిమాలోని డైలాగ్ ను ట్వీట్ చేశాడు. సోషల్ మీడియా లో ఈ ట్వీట్ మంచు మనోజ్ ను ఉద్దేశించే విష్ణు చేశాడని చర్చ జరుగుతోంది.విష్ణు ట్వీట్ చేసిన కాసేపటికే మనోజ్ మరో ట్వీట్ చేయడం సోషల్ మీడయాలో హీట్ పెంచింది. 'కన్నప్పలో రెబల్ స్టార్ కృష్ణం రాజు గారి లాగా సింహం అవ్వాలని ప్రతి ఫ్రాడ్ కుక్కకి ఉంటుంది, ఈ విషయం నువ్వు ఇదే జన్మలో తెలుసుకుంటావ్' అని మనోజ్ కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశాడు.



# స్కిల్ వర్సిటీకి టెక్నికల్ సహకారం

తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

# పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

కరీంనగర్,జనవరి 17

పాత రేషన్ కార్డులు తొలగిస్తారనే ప్రచారం అబద్ధమని, అలాంటివి నమ్మవద్దని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ? 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం పక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# రేవంత్ ప్రభుత్వ వేధింపులు ఎక్కువయ్యాయి

హైదరాబాద్,జనవరి 17 )

: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తన న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో కౌశిక్‌రెడ్డిని విచారించారు. గతేడాది డిసెంబర్ 4న ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు కౌశిక్‌రెడ్డి వెళ్లారు. సీఐ వాహనానికి తన వాహనం అడ్డుపెట్టి అనుచరులతో హల్‌చల్ చేశారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. మాసబ్ ట్యాంక్‌లో విచారణ ముగిసిన అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా వేధిస్తుందో అందరూ గమనిస్తున్నారని విమర్శించారు. బాధ్యతగల పౌరుడిగా విచారణకు సహకరించేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. 'గతంలో బంజారాహిల్స్‌లో పిటిషన్ ఇచ్చేందుకు సీఐ దగ్గరికి వెళ్తే ఆయన లేచి పరుగులు పెట్టబోయారు. బాధ్యత గల ఎమ్మెల్యేగా నేను స్టేషన్‌కు వెళ్లినప్పుడు సీఐగా ఆయన బయటికి పరుగులు పెట్టొచ్చా అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చినప్పుడు రిసీవ్ చేసుకోవాలా వద్దా? సీఐ బయటికి వెళ్తున్న క్రమంలో.. నేను పిటిషన్ ఇచ్చేందుకు వచ్చానని చెప్పాను. పిటిషన్ తీసుకొని వెళ్తే అయిపోతుంది కదా అన్నాను. పిటిషన్ ఇచ్చిన రెండు గంటల తర్వాత నాపై కేసులు నమోదు చేశారు. వందలాది మంది పోలీసులను మరుసటి రోజు నా ఇంటికి పంపించారు. డోర్లు పగులగొట్టి నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేశారు. నా ఇంటి డోర్లు పగులగొట్టే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారు? నా బెడ్‌రూమ్ దగ్గరికి వచ్చి అరెస్టు చేసేందుకు నేను క్రిమినల్‌నా?' అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

# యోనో యూజర్లకు హెచ్చరిక

ముంబై,జనవరి17

: ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన యూజర్లను అలర్ట్ చేసింది. యూజర్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఆండ్రాయిడ్ 11, అంత కంటే తక్కువ వెర్షన్ మొబైల్స్‌లో యోనో సేవల్ని నిలిపి వేయనుంది. ఈ మేరకు పాత వెర్షన్ వాడుతున్న స్టేట్ బ్యాంక్ కస్టమర్లకు సందేశాలు పంపుతోంది. యూజర్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28 లోపు పాత వెర్షన్ ఫోన్లు వాడుతుంటే వారు ఆండ్రాయిడ్ 12 అంత కంటే కొత్త వెర్షన్‌కు అప్‌గ్రేడ్ అవ్వాల్సి ఉంటుంది. లేకపోతే యోనో సేవలు నిలిచిపోతాయని స్పష్టం చేసిం

# సంపాదకీయం

శుక్రవారం 17-1-2025

## రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?

ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్ధమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు

సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.

ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తిని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జిఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.

------------------

# సవాళ్లతో చట్టాలను చులకన చేస్తారా ?

హైదరాబాద్,జనవరి17 :
ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది.

**అనుమతి లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారు**

**దబాయింపు రాజకీయాలతో ప్రజలు వంచిస్తారా**

**కెటిఆర్ సవాళ్ల రాజకీయాలపై సర్వత్రా విమర్శలు**

# ఉమ్మడి ఎపి కోసం ఆనాడు గట్టిగానే పోరాడాం

**విభజన వల్ల నష్టపోయేది రాయలసీమ అని చెప్పాం**

**సీమకు ప్రాజెక్టుల వల్లనే మేలు జరగగలదు**

**మాజీ ఎంపి టిజి వెంకటేశ్ వెల్లడి**

కర్నూలు,జనవరి17 :
ఆంధ్రప్రదేశ్ సమైక్య రాష్ట్రంగా ఉండాలని పోరాటం మొదలు పెట్టింది తానేనని, రాయలసీమ ప్రాంతం వెనకబడిందని ఆధారాలతో సహా రాజకీయ పార్టీలకు ఇచ్చామని.. అప్పుడు ప్రణబ్ ముఖర్జీ మాకు పూర్తి మద్దతు తెలిపారని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. విడిపోతే నష్టపోయేది రాయలసీమేనని ఆనాడు గట్టిగా వాదించామని చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ విభజనకు అప్పటి సిఎంగా ఉన్న రోశయ్య మద్దతు తెలపలేదని చెప్పారు. ట్యాంకు బండ్‌పై విగ్రహాలు పగలకొడుతున్నప్పుడు శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం పగలగొట్టే ముందు మాపై దాడి చేయండని కోరానని.. వెంటనే ఆందోళన కారులు మమ్మల్ని గౌరవించి వెనక్కి వెళ్ళారన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు చేసే దిశగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చర్యలు మొదలు పెట్టాలని, విభజన హామీల అమలుకు తెలంగాణ పొలిటికల్ పార్టీలు కూడా సహకరిం చాలని టీజీ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఏపీలో కేంద్రం నిధులు ఇచ్చే ప్రాజెక్టులే వేగంగా ముందుకు వెళు న్నాయని, తెలుగు రాష్ట్రల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు ముఖ్యమైన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఏపీ పారిశ్రామిక వేత్తలు తెలంగాణలో ట్యాక్సులు కడుతున్నారని, అందులో మనకు రావాల్సిన షేర్లు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జితో ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర మంత్రి గడ్కరిని కోరానని, అందుకు గడ్కరి అంగీకారం తెలిపారన్నారు. కానీ గత ప్రభుత్వం అందుకు ప్రతిపాదనలు పంపక పోవడం వల్ల ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని, గత ప్రభుత్వం అనుమతి లేకుండా పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ఎత్తి పోతల పథకం చేపట్టిందని, దీంతో ఆ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిందని, భారీగా ప్రజాధనం వృథా అయిందని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాయలసీమలో పారిశ్రామిక విప్లవం వస్తోందని, తన కుమారుడు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సీమలో ప్రాజెక్టుల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ఆయకట్టు మొత్తానికి నీరు అందించేలా కాలువల పనులు చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు ఇంకా నిషాలో ఉన్నాయని, కేంద్రం పెద్దల నిర్ణయం మేరకే రాష్ట్ర నాయకత్వ మార్పు ఉంటుందని టీజీ వెంకటేష్ అన్నారు. బీజేపీ పెద్దలు.. మెగాస్టార్ చిరంజీవి స్నేహ పూర్వకంగా ముందుకు వెళ్తున్నారని, తదుపరి విషయాలు తనకు తెలియవని అన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం వల్ల కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలన అద్భుతంగా ఉందని కొనియాడారు. డోన్ టీడీపీ నాయకుడుపై దాడి చేసిన వారిని రెండు రోజుల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు మొదలవు తాయని, గత ప్రభుత్వంలో ఆలయాలపై ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కర్నూల్‌కు హైకోర్టు బెంచ్ గతంలోనే వచ్చేదని, కానీ కొంతమంది న్యాయవాదులు ఆందోళనలు చేయడం వల్ల ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తుందని

# 19తో ముగియనున్న ఉత్తర ద్వార దర్శనాలు

**21 నుంచి ఇక సర్వ దర్శనాలకు టిటిడి ఏర్పాట్లు**

తిరుమలజనవరి17
:కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రస్తుతం వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10 నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. దాదాపు పది రోజుల పాటు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించింది . దీంతో పెద్ద సంఖ్యలతో భక్తులు తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించి దర్శనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఏడురోజులుగా వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. లక్షల్లో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు.మరో మూడు రోజుల పాటు ఈ దర్శనాలు కొనసాగనున్నాయి. ఈనెల 19వ తేదీతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ద్వార దర్శనం నేపథ్యంలో తిరుమలలో అన్ని సేవలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సామాన్య భక్తులకే స్వామి వారి దర్శనం కల్పించేలా ఏర్పాటు చేశారు టీటీడీ అధికారులు. కాగా.. ఈనెల19తో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్న నేపథ్యంలో శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. శ్రీవారి సర్వదర్శనాలను 20 నుంచి పునరుద్ధరించబోతోంది. అందుకోసం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొని సర్వదర్శనాలపై చర్చలు జరిపారు. నెల 19తో వైకుంఠ ద్వార దర్శనం ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ ముగియనుంది. . అలాగే 19న ఆన్‌లైన్‌లో కూడా శ్రీవాణి దర్శన టికెట్లను జారీ చేయరని తెలిపారు. అలాగే 20న ప్రోటోకాల్ భక్తులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనం కూడా రద్దు చేశామని.. ఈ నేపథ్యంలో 19న వీఐపీ బ్రేక్ దర్శనం కోసం సిఫార్సులను స్వీకరించబోమని టీటీడీ ఈవో శ్యామలారావు పేర్కొన్నారు. కాగా.. ఈనెల 21 నుంచి శ్రీవారి సర్వదర్శనం టోకెన్స్‌ని ఏ రోజుకు ఆ రోజు జారీ చేయనున్నారు. అలాగే రద్దు చేసిన ఆర్జిత సేవలు కొనసాగుతాయి.

# అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి

**లాకెన్ రిలే చట్టాన్ని సవరించాల్సిందే**

**అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ వెల్లడి**

వాషింగ్టన్,జనవరి17(
మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు. హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడీ ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళు తున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది



అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

# కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు

**పది ప్రత్యేక బృందాలతో పలుచోట్ల గాలింపు**

**బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా గుర్తింపు**

హైదరాబాద్,జనవరి17(ఆర్ఎన్ఎ): కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పూర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పుర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం. అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పుర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం. బీదర్‌లో కాల్పులు జరిపింది బీహార్ ముఠాగా గుర్తించారు. వారం రోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్ దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా.. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్.. అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్‌లో రెండు రోజులుగా రెక్కీ చేసి మరీ అమిత్ కుమార్ ముఠా దోపిడీ చేసింది. అనంతరం బీదర్‌లో దోపిడీ చేసిన నగదును హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఇక్కడ రెండు బ్యాగ్‌లను కొనుగోలు చేసిన ముఠా.. అఫ్జల్‌గంజ్‌లో కొనుగోలు చేసిన బ్యాగ్‌లలోకి డబ్బులు నింపి అనంతరం పరారయ్యారు. పలు దోపిడీ కేసులో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో బీదర్ పోలీసులు కలిసి రాయ్‌పూర్ వెళ్లారు. రాయ్‌పూర్, బీహార్‌లో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకుందనేందుకు యత్నిస్తున్నారు. కాల్పుల ఘటనలో నిందితులను పట్టుకునేందుకు మొత్తం 10 టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సిటీ శివారులు అన్ని ప్రాంతాల్లో గాలిస్తున్నామన్నారు. ఇద్దరి కదలికలు అనుమానంగా ఉండటంతో డ్రగ్స్, గంజాయి ఏమైనా తరలిస్తున్నారా అనే అనుమానంతో ట్రావెల్స్ సిబ్బంది జహంగీర్ బ్యాగ్‌లు తనిఖీ చేయాలని పట్టుబట్టాడని తెలిపారు. అందులో డబ్బు ఉండటంతో హవాలా డబ్బుగా అనుమానించిన జహంగీర్ పోలీసలకు చెప్తాను అని అన్నాడని.. దీంతో వెంటనే దండుగులు అతనిపై

కాల్పులు జరిపినట్లు చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో పారిపోయారని.. ట్యాంక్ బండ్ వరకు వెళ్ళారన్నారు. అక్కడి నుంచి బీహార్ వెళ్ళి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు.

# సైఫ్‌పై దాడిలో క్రిమినల్ గ్యాంగు ప్రమేయం లాంటిదేమీ లేదని తోసిపుచ్చిన మంత్రి

ముంబై,జనవరి17

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దుండగుడి దాడి ఘటనతో ముంబయి నగరం మరోసారి ఉలిక్కిపడింది. గతంలో ప్రముఖులపై మాఫియా గ్యాంగ్‌లు దాడులకు పాల్పడిన ఘటనలను గుర్తుచేసింది. అయితే, సైఫ్ దాడి వెనుక చోరీ ఉద్దేశం మాత్రమే కనిపిస్తోందని మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. దీనిలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయాన్ని తోసిపుచ్చారు.'సైఫ్‌పై దాడి చేసినట్లుగా భావించి ఓ అనుమానితుడి ముంబయి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీలో కనిపించిన వ్యక్తి ముఖానికి దగ్గర పోలికలు ఉన్న ఈ యువకుడికి నేర చరిత్ర ఉంది. అయితే, ఈ ఘటనతో అతడికి సంబంధం లేదని గుర్తించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది' అని మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ పుణెలో విలేకరులతో పేర్కొన్నారు. మరో వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారని చెప్పారు. దాడిలో ఘటనలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అటువంటి కోణం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని మంత్రి పేర్కొన్నారు. కేవలం చోరీ కోసమే నిందితుడు వచ్చినట్లు ఇప్పటివరకు తెలిసిందన్నారు. ఏదైనా బెదిరింపు వచ్చినట్లు సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని, సెక్యూరిటీని కూడా కోరలేదని చెప్పారు. ఒకవేళ భద్రతను కోరితే నిబంధనల ప్రకారం కల్పిస్తామన్నారు.సైఫ్ శరీరం నుంచి పదునైన వస్తువును బయటకు తీసినట్లు లీలావతి ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన వెన్నెముకకు ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ఐసీయూ నుంచి ప్రత్యేక రూమ్‌కు తరలిస్తామని.. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు.

# వలసదారుల పడవ బోల్తా


## -50మంది గల్లంతయినట్లు అంచనా

లాహోర్,జనవరి17 : స్పెయిన్‌కు వెళ్లాలనుకున్న 86 మంది వలసదారుల పడవ మొరాకో వద్ద బోల్తా కొట్టిందని అధికారులు తెలిపారు. వారిలో 50 మంది వలసదారులు మునిగిపోయి ఉంటారని వలసదారుల హక్కుల గ్రూప్ 'వాకింగ్ బార్డర్స్' గురువారం తెలిపింది. కాగా మొరాకో అధికారులు 36 మందిని కాపాడారు. 66 మంది పాకిస్థానీలతో మొత్తం 86 మంది వలసదారులున్న ఆ పడవ మౌరిటానియాకు జనవరి 2న బయలుదేరింది. కాపాడిన వారిలో 44 మంది పాకిస్థాన్‌కు చెందిన వారేనని 'వాకింగ్ బార్డర్స్' సిఈవో హెలెన మలేనో 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. కాగా పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం తమ మొరాకో రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉన్నట్లు గురువారం తెలిపింది.'రబత్(మొరాకో)లోని మా పాకిస్థాన్ రాయబార కార్యాలయం ఆ పడవ 80 మంది ప్రయాణికులతో వెళ్లిందని, వారిలో చాలా మంది పాకిస్థానీయులు ఉన్నారని, ఆ పడవ మౌరిటానియాకు వెళుతుండగా మొరాకో ఓడరేవు డఖ్లా వద్ద బోల్తా కొట్టిందని, ప్రాణాలతో బయటపడిన వారిలో కూడా పాకిస్థానీలే అధికంగా ఉన్నారని తెలిపింది' అని పేర్కొంది. బాధితులైన పాకిస్థానీలకు వీలైనంత సాయం అందించమని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాఖ్ దర్ ప్రభుత్వ సంస్థలకు ఆదేశించారు. కాగా అక్రమ వలసలను అరికట్టే చర్యలు చేపట్టాలని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉదంతంపై ప్రధాని షెహబాజ్ షరీఫ్ నివేదిక కోరారు. యూరొప్‌కు అక్రమంగా వలస వెళ్లే ప్రయత్నంలో వందలాది మంది పాకిస్థానీ వలసదారులు ప్రతి సంవత్సరం మృత్యువు పాలవుతున్నారు.

# కృష్ణాజలాలపై కెసిఆర్ పోరు ఫలించింది: కవిత

హైదరాబాద్,జనవరి17

: బీడుబడ్డ తెలంగాణ భూములకు కృష్ణా జలాలను మళ్లించాలని ఉద్యమ నేత కెసిఆర్ చేసిన కృషి ఫలించిందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో వాటాపై ట్రిబ్యునల్ ఉత్తర్వులపై ఎంఎల్‌సి కవిత ఎక్స్ వేదికగా స్పందించారు. కృష్ణా నీళ్లలో మా వాటా మాకే అని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన పోరాట ఫలాలు అందుకోవడం ఎంతో దూరంలో లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరపాలని గత పదేళ్లుగా కెసిఆర్ చేసిన వాదనకే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మొగ్గు చూపడం సంతోషకరమని అన్నారు. ఇది బిఆర్ఎస్ పార్టీ విజయం?తెలంగాణ ప్రజల విజయం అంటూ ట్వీట్ చేశారు.



# మాజీ సిఐడి చీఫ్ సునీల్ కుమార్ పై విచారణ

**అధారిటీని నియమించిన కూటమి ప్రభుత్వం**

అమరావతి,జనవరి17 :

పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ పై విచారణకు అధారిటీని ప్రభుత్వం నియమించింది. ఆయనపై గతంలో నమోదు అయిన అభియోగాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన ఇచ్చిన వివరణను తిరస్కరించిన ప్రభుత్వం ఎంక్వయిరీకి కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. విచారణకు అథారిటీని వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అథారిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తాలు ఉంటారు. సాధ్యమైనంత త్వరగా సునీల్ కుమార్‌పై ఉన్న అభియోగాలపై నివేదిక ఇవ్వాలని అధారిటీని ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన పీవీ సునీల్ కుమార్ వైఎస్ఆర్‌సీపీ హయాంలో సీఐడీ చీఫ్ గా ఉన్నారు. ఆ సమయంలో ఆయన చాలా అవకతవకలకు పాల్పడ్డారని .. వైసీపీ అధినేత కోసం టీడీపీ నేతల్ని తప్పుడు కేసులతో వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ వచ్చారు. ముఖ్యంగా రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయనపై కేసు నమోదు అయింది. ఈ కేసు విషయంలో సోషల్ మీడియాలో చేసిన కామెంట్స్ కారణంగా ఆయనపై క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆయనకు ఎక్కడా పోస్టింగ్ రాలేదు. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన కీలక పాత్రధారి అని ఫిర్యాదు దారు, డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రఘురామ పై కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టు అయిన మాజీ ఓఎస్డీ విజయ్ పాల్, కామేపల్లి తులసీబాబు అనే వ్యక్తులు ఇద్దరూ సునీల్ కు సన్నిహితులని చెబుతున్నారు. కామేపల్లి తులసిబాబు సీఐడీకి లీగల్ అడ్వయిజర్ గా..సునీల్ నియమించారని ఆయనను అడ్డం పెట్టుకుని దందాలు చేశారని అంటున్నారు. తనను అరెస్టు చేసిన రోజున సీఐడీ ఆఫీసులో తనపై కూర్చుని.. తనకు ఊపిరి ఆడకుండా చేసి చంపే ఎ÷–లాన్ చశారని దానికి పీవీ సునీలే కారణమని రఘురామ ఆరోపిస్తున్నారు. అదే సమయంలో తులసీబాబును అడ్డం పెట్టుకుని అగ్రిగోల్డ్ కు బాధితులకు అందాల్సిన సొమ్మును పక్కదోవ పట్టించి దోచుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే నివేదిక రెడీ అయినట్లుగా చెబుతున్నారు. అలాగే సునీల్ కుమార్ సర్వీసులో ఉంటూనే ఓ మతపరమైన సంస్థను నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన హిందూత్వంపై గతంలో చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని కొన్ని సంస్థలు కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. పలుమార్లు కేంద్ర హోంశాఖ నుంచి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి లేఖలు వచ్చాయి. ఓ సారి గట్టిగా హెచ్చరికలు రావడంతో ఆయనను సీఐడీ చీఫ్ పదవి నుంచి బదిరి చేసినట్లుగా చెబుతున్నారు. తాజాగా విచారణకు కమిటీ వేయడంతో చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

# బళ్లారి అధికారులపై పలు ఫిర్యాదులు

## -నేడు విచారించనున్న ఉప లోకాయుక్త

బెంగళూరు,జనవరి17

ప్రభుత్వ అధికారుల పనితీరుపై బళ్లారి జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణకు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ పిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్ళారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీసుల్లో పైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్థలు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

# వైట్‌హైజ్ వద్ద ట్రక్కుతో దాడికి యత్నం

## -భారత సంతతికి చెందిన సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు

వాషింగ్టన్,జనవరి17

అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద 2023లో భారత సంతతి యువకుడు ట్రక్కుతో దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపిన ఘటనలో నిందితుడైన తెలుగు సంతతి వ్యక్తి 19 ఏళ్ల కందుల సాయి వర్షిత్ కు కోర్టు 8 ఏళ్ల జైలుశిక్ష విధించింది. వర్షిత్‌ను అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసులో అతడికి 8 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు జడ్జి డాబ్నీ ఫ్రెడ్రిచ్ వెల్లడించారు. నాజీ భావజాలంతో వెళ్లి డెమోక్రటిక్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యువకుడు యత్నించాడని పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నాజీ భావజాలంతో కూలగొట్టాలనే ఉద్దేశంతో సాయివర్షిత్ ఈ దాడికి యత్నించాడు. అవసరమైతే అధ్యక్షుడిని కూడా చంపాలని తాను నిర్ణయించు కున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడికి 8ఏళ్లు శిక్ష విధించాలని న్యాయస్థానం నిర్ణయించింది. అతడి చర్యల వల్ల ధ్వంసమైన నిర్మాణాల తొలగింపు, పునర్నిర్మాణం మొదలైన ఖర్చులతో కలిపి నేషనల్ పార్క్ సర్వీస్‌కు జాఆ 4,322 డాలర్ల (సుమారు రూ.3,74,000) నష్టం వాటిల్లిందని కోర్టు పేర్కొంది. కోర్టు పత్రాల ప్రకారం.. 2023 మే 22 సాయంత్రం మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి సాయి వర్షిత్ వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకొని రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకువెళ్లి సైడ్‌వాక్‌పై వాహనాన్ని నడిపాడు. పాదచారులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. అనంతరం శ్వేతసౌధం ఉత్తరభాగం వైపు భద్రత నిమిత్తం ఏర్పాటుచేసిన ట్రాఫిక్ బారియర్స్‌ను ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కును రివర్స్ చేసి మరోసారి ఢీకొట్టాడు. వాహనం నుంచి కిందకుదిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అధ్యక్షుడు జో బైడెను హత్య చేయాలనే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి యత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం అతడు ఆరు నెలలుగా ఎ÷–లాన్ చేసి మరీ ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. ఈవిషయాన్ని సాయివర్షిత్ విచారణలో అంగీకరించినట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు మీడియాకు తెలిపాయి. దీంతో అతడిని అరెస్టు చేశారు.

# ఉద్యోగుల పనితీరుపై నిఘా ఉండాల్సిందే

**అత్యుత్తమ పనితీరుకు ఇది దోహద పడుతుంది**

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అభిప్రాయం**

అమరావతి,జనవరి17

ఉద్యోగుల పనితీరుపై సున్నితమైన విజిలెన్స్ ఉండాలని.. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శినిలా పని చేస్తుందన్నారు. ఉద్యోగులపై నమోదవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల ఉద్యోగుల పనితీరుపై ప్రభావం చూపిస్తుందన్నారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని.. ఇలా అపరిష్కృతంగా ఉండటం వల్ల ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేకపోతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు, శాఖాపరమైన విచారణలకు సంబంధించిన విచారణలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. అందుకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. నివేదికను మూడు వారాల్లోగా ఇవ్వాలని ఆదేశించారు. అయితే, అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినపుడు దానికి తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదని, ఇది విచారణలో జాప్యానికి కారణం అవుతోందని అధికారులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. తన శాఖల పరిధిలో విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు సూచించారు. ఏదైనా విషయంలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలన్నారు. ప్రాథమిక విచారణలోనే బలమైన ఆధారాలు సేకరించాలన్నారు. విచారణ అధికారి, ఆరోపణలు వచ్చిన ఉద్యోగికి మధ్య ఎలాంటి సన్నిహిత సంబంధాలు లేకుండా తొలి దశలోనే నిరోధించాలని స్పష్టం చేశారు. అన్ని విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన, సక్రమమైన పద్ధతిలో తిరిగి విచారించి వేగంగా వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధిపతులు దృష్టి సారించాలన్నారు.

# పంటలు పండించే భూములకే రైతు భరోసా

-సాగుకు యోగ్యం కానీ భూములను తొలగించండి

-యోగ్యం కాని భూములను వెంటనే గుర్తించాలి

-యాచారంలో అకస్మాత్తుగా తనిఖీ -జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్

-ఆర్డీవో అనంతరెడ్డి, తాసిల్దార్ అయ్యప్ప తో భూ రికార్డుల పరిశీలన





యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 17):. రైతులు వ్యవసాయం చేసి పండించిన పంటలకే రైతు భరోసా వర్తిస్తుందని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో అకస్మాత్తుగా ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి , ఏడి సుజాత, యాచారం తహసిల్దార్ అయ్యప్ప తో తనిఖీ నిర్వహించారు. రెవిన్యూ అధికారులతో భూ రికార్డులను పరిశీలించారు. సాగుకు యోగ్యం కానీ భూములను వెంటనే తొలగించాలని రెవెన్యూ అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. యాచారం, మంచాలలో యోగ్యం కాని భూములు ఆర్డీవో అనంతరెడ్డిని గుర్తించాలని ఆమె సూచించారు. రాళ్లు ,రప్పలు, గుట్టలు, పామ్ ల్యాండ్, లేఅవుట్, ఇలాంటివి భూములు రైతు భరోసా వర్తించదని తెలిపారు. ఇప్పటికీ యాచారంలో ఆరు గ్రామాలలో(మేడిపల్లి, తాడిపర్తి ,నానక్ నగర్ ,కురుమిద్ద ,చౌదరిపల్లి) యోగ్యం కాని భూములను గుర్తించామని అడిషనల్ కలెక్టర్ కి యాచారం తాసిల్దార్ అయ్యప్ప తెలిపారు. మిగతా గ్రామాలు మూడు రోజులలో ఐడెంటిఫై చేస్తామని అడిషనల్ కలెక్టర్ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీ ఓ శ్రీలత, వ్యవసాయ మండల అధికారి రవీంద్రనాథ్, రెవిన్యూ అధికారులు రామకృష్ణ, మురళి, బాలాజీ, జంగయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సర్వే పారదర్శకంగా నిర్వహించాలి -ఎంపీడీవో నరేందర్ రెడ్డి

యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 17):. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం, చింతపట్ల, గునుగల్ లో సర్వేను ఎంపీడివో పర్యవేక్షించారు. సర్వే పారదర్శకంగా ఉండాలని సెక్రటరీలకు, సిబ్బందికి సూచించారు. ఏలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సర్వే విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తిరుపతయ్య, రవికుమార్ రెడ్డి, కారోబార్ ఎన్ ఆర్ కృష్ణ, మస్కు శరణం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం




కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ జనవరి 17

కొండమల్లేపల్లి మండలంలోని చిన్న అడిశర్ల పల్లి గ్రామములో , జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి పశు వైద్యాధికారి డి ఎల్ డి ఏ నల్గొండ ఈవో డాక్టర్ రాజశేఖర్ మరియు మండల డాక్టర్ గంధం నాగయ్య హాజరై పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులను పరిశీలించి చికిత్స చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గేదెలకు ఆవులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పశు సంపదను సంరక్షించుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో దూడలకు నట్టల నివారణ మందులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ గోపాలమిత్ర భూతరాజు సైదులు, పంది వెంకులు, రైతులు ఇంద్రకంటి సత్యనారాయణ రెడ్డి,బాతుక సత్తయ్య, రావుల శ్రీనయ్య, రావుల వెంకటయ్య,జాల శ్రీను, రవిరాళ్ళ శ్రీనయ్య, రావుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



## కిష్టాపురంలో రైతు భరోసా సర్వే

చండూర్ జనవరి 17 (శాసనసభ న్యూస్):

మునుగోడు మండలం కిష్టాపురం రైతు భరోసా అమల్లో భాగంగా కిష్టాపురం గ్రామంలో సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అగ్రికల్చర్ అధికారులు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి పారిజాత జూనియర్ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఏఈఓ అనిల్ కుమార్, గ్రామ సెక్రెటరీ వెంకటేష్, మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య గౌడ్, మునుకుంట్ల పరమేష్, మాలుగు శ్రీను, వేణు, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యోగ్యంలేని భూములను గురించాలి

:-తహసిల్దార్ బి. సుదర్శన్ రెడ్డి,



తుర్కయంజాల్ :శాసన సభ :

రైతు భరోసా కార్యక్రమంలో బాగంగా పంటలు సాగుచేయని వ్యవసాయ యోగ్యంగానీ భూములను గుర్తించాలని సిబ్బందికి అబ్దుల్లాపూర్ మెట్ తహసిల్దార్ బి. సుదర్శన్ రెడ్డి,ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలో ని మునుగనూర్ , చిన్న రావిరాల గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతుభరోసా పథకానికి అనర్హులైన వ్యవసాయానికి యోగ్యంకాని రైతుల భూములను, రాళ్లు, గుట్టలు, లేఅవుట్ ఇండ్ల స్థలాలు, ప్రభుత్వం కొన్న రైతుల భూమి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. లబ్దిదారులను గుర్తించేటప్పుడు నిజమైన లబ్దిదారులకు నష్టం జరుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఇబ్రహీంపట్నం ఏ. డి. సుజాత,ఆర్. ఐ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై సొంత బాబాయి అఘాయిత్యం

ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 18

సంక్రాంతి పండుగసందర్భంగా కొత్త దుస్తులు కొనిస్తానని సొంత అన్న కూతురైన బాలికను తీసుకెళ్లి ఓకామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు (31) అనే వ్యక్తి తుర్కయంజాల్ లో నివాసం ఉంటూ, మంగలి పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతని సొంత అన్న కూతురు (14) యాచారంలో 9వ తరగతి చదువుతోంది.గురువారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లిన ఆంజనేయులు మైనర్ బాలికకు కొత్త బట్టలు కొనిస్తానని తుర్కయంజాల్ కు తీసుకెళ్లి, ఆ తర్వాత సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో ఓ హెూటల్ లోని ఓయో రూంకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రతిఘటించి తప్పించుకొని భయంతో బయటకు వచ్చి కేకలు వేస్తూ రోడ్డు పక్కన వారికి విషయం చెప్పగా వారు 100 ఫోన్ చేసి చెప్పారు. ఆంజనేయులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు అతన్ని పట్టుకున్నారు. తల్లిదండ్రులు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఆంజనేయులు పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా నిందితుడు ఆంజనేయులుకు వివాహం అయ్యి ఇద్దరు పిల్లలున్నారు.

## టి ఎస్ ఎస్ ఓ డివిజన్ అధ్యక్షుడిగా రహీముద్దీన్




చింతపల్లి,శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 18

తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టి ఎస్ ఎస్ ఓ) దేవరకొండ డివిజన్ అధ్యక్షుడిగా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఎం.డి రహీముద్దీన్ ను తెలంగాణ సామాజిక స్టూడెంట్ అండ్ సేవా ఆర్గనైజేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కలకొండ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం రహీముద్దీన్ ను ఏకగ్రీవంగా నియమించినట్టు తెలిపారు.ఈ సందర్భంగా రహీముద్దీన్ మాట్లాడుతూ ప్రతి సమస్య పైన పాలుపంచుకునే విధంగా నా యొక్క కర్తవ్యాన్ని నిర్వహిస్తానని అన్నారు. అధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కలకొండ లక్ష్మణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టి ఎస్ ఎస్ ఓ నాయకులు క్రాంతి కుమార్, విజెందర్ రెడ్డి,సీలం సైదేశ్వర్ ,విష్ణు ఖాజ,
తదితరులు పాల్గొన్నారు.

## మేటిల్ల గ్రామ సమస్యలు తీర్చాలంటూ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి



ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 18

ఎలిమినేడు గ్రామపంచాయతీ అనుబంధ గ్రామము మేటిల్ల లో ఉన్నటువంటి సమస్యల గురించి 40 మంది మేటిల్ల గ్రామం నుండి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేను మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసారు. మేటల్ల గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించి మేటిల్ల గ్రామ ప్రజలకు న్యాయం చేస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గుంటి మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, డిసిపి చైర్మన్ మంకాల శేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి పిట్టల యాదగిరి, యాదయ్య, ప్రభాకర్, పట్నం బీరప్ప, జంగయ్య, రాములు అరవింద్ రంగారావు, నరసింహ్మ,శంకర్,ఈశ్వర్,అనంద్ గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు

కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ జనవరి 17

ప్రశ్నించే గొంతుక,నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే యోధుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలను నల్గొండ జిల్లా దేవరకొండ కొండమల్లేపల్లి పట్టణలలో అంబేద్కర్ విగ్రహాల వద్ద అటహాసంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో క్యూన్యూస్ శనార్తితెలంగాణ దేవరకొండ ఇన్చార్జ్ అదేపు సతీష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రతిపక్షంలో ఉన్న అధికారపక్షంలో ఉన్న అక్షరం ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఎప్పటికప్పుడు నిజాలను నిర్భయంగా చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పాలకుల అవినీతి ఆగడాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపరుస్తూ అంచలంచలుగా ఎదిగారని ఇప్పుడు బీసీ ఉద్యమాన్ని తన భుజాలపై వేసుకొని బీసీలను చైతన్య పరుస్తూ రాజ్యాధికారం లక్ష్యంగా పని చేస్తున్నటువంటి తీన్మార్ మల్లన్న ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. ధైర్యానికి నిలువెత్తు నిదర్శనం మల్లన్ననే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికంటి ఆంజనేయులు ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి,సహదేవుడు,అంజి,గిరి,సుమన్,హాబీబ్, ప్రజా సంఘ నాయకులు రమేష్ గ్యార గిరి మార్కెట్ డైరెక్టర్, రమేష్ వెంకటేష్ రిపోర్టర్ లింగం తదితరులు పాల్గొన్నారు.






# ఘనంగా ముగిసిన

# సంక్రాంతి వైపిఎల్ టోర్నమెంట్.....

## ■యువత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి..

## ■క్రమశిక్షణ, అంకితభావంతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయం ఖాయం.

## ■విద్యా, క్రీడా రంగాల్లో యువతను ప్రోత్సహించడమే తన లక్ష్యం...

## ■యువజన నాయకుడు, సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్

## ■క్రీడలతో శారీరక దారుఢ్యం, యువత మధ్య స్నేహభావం:దంటు జగదీశ్వర్.

మర్రిగూడ,శాసన సభ :యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావంతో కృషి చేస్తే విజయం తప్పకుండా దరిచేరుతుందని యువజన నాయకుడు, సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్ అన్నారు.మర్రిగూడ మండల పరిధిలోని యరగండ్లపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి వైపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ ముగియడంతో సంతోష్ యాదవ్ విజేతలకు నగదు తో పాటు ట్రోఫీలను అందజేశారు.

విజేతలకు మొదటి బహుమతి శ్రీరామ్ జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ బహుమతిసాయిశ్వర్ జట్టుకు రూ.15 వేలతో పాటు తృతీయబహుమతి అభి జట్టుకు రూ. 10 వేల తో పాటు మెమెంటోల ను మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్ తో కలిసి ఆయన అందజేశారు. టోర్నమెంట్ లో పాల్గొన్న మిగతా టీమ్ లకు ప్రోత్సాహక బహుమతులను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులకు కొదవలేదన్నారు. తరచూ పోటీలను నిర్వహించడం క్రీడాకారు ల్లోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నా రు.

యువతను విద్య, క్రీడా రంగాల్లో ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలోని యువతీ యువకులు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదువు కోసం యువతకు కావలసిన మెటీరియల్ ను అందిస్తానని తెలియజేశారు .రాజకీయంగా, ఉద్యోగాలపరంగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. యువతలో స్ఫూర్తిని నింపేందుకు గ్రామంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి యువకులను శాలువాతో సన్మానించి మెమోంటోలను అందజేశారు.దంటు జగదీశ్వర్ మాట్లాడుతూ....గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ దోహదం చేస్తుందని అన్నారు. క్రీడారులను వెలికితిసేందుకు ఏర్పాటు ఈ టోర్నిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, యువత మధ్య స్నేహభావం పెరుగుతాయన్నారు. యరగండ్లపల్లిలో సంతోష్ యాదవ్ టోర్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు.క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవా లన్నారు. నేటి గెలుపును భవిష్యత్తుకు బంగారు బాటలుగా మలు చుకోవాలని, అలాగే ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపునకు ప్రయత్నం సాగించాలని ఆయన యువకులకు సూచించారు.అనంతరం సంతోష్ యాదవ్ తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైనప్పటికీ యువతను నిరుత్సాహపరచకుండా టోర్నమెంటును విజయవంతంగా నిర్వహించినందుకు గ్రామ పెద్దలు సంతోష్ యాదవ్ ను అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కుక్కడపు యాదయ్య గౌడ్, డా. రమణ, నాయకులు, క్రీడాకారులు,ఆర్గనైజర్ లు పాల్గొన్నారు.








# మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో విజేతలుగా నిలిచిన బుర్రిలంక జట్టు.

రాజమండ్రి రూరల్,

కడియం మండలం బుర్రిలంక ఎలిమెంటరీ పాఠశాల నందు సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గత నాలుగు రోజులుగా నిర్వహించారు. మండలంలోని 11 గ్రామాల నుండి క్రికెట్ జట్టుకు పోటీలు నిర్వహించగా శుక్రవారం జరిగిన ఫైనల్లో కడియం, బుర్రిలంక జట్లు మధ్య పోటీ పడగా విజేతగా బుర్రిలంక జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు కడియపులంక గ్రామ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ చేతుల మీదుగా మొమెంటో, నగదు అందించారు. ఈ కార్యక్రమంలో బుర్రిలంక ప్రాథమిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రౌండ్ సభ్యులు కట్టా శివ, పుల్లా ఎన్.ఆర్ నాగిరెడ్డి దొరబాబు, పాఠం శెట్టి పట్టాభి, చిన్న రాము, గాద రాజా, నాగిరెడ్డి శంకర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



ఆలమూరు, :

పుష్య మాస సంకటహర చతుర్థి సందర్భంగా ఆలమూరు మండలం పెదపళ్ళ శ్రీ బాలగణపతి స్వామి వారి ఆలయంలో ప్రాతఃకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెదపూడి సత్యనారాయణాచార్యులు (సత్తిబాబు) ఆవు పాలు, పెరుగు, తేనె, గంధం, విభూది, కుంకుమ, హరిద్ర అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామావళితో గరిక, పుష్పార్చనలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న పమిడి రవికుమార్ చౌదరి



కావలి,

దగదర్తి మండలం మనుబోలుపాడు కు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. శుక్రవారం లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. సభ్యత్వ కార్డును కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న రవికుమార్ చౌదరి ని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అభినందించారు.

# ఎన్ టి ఆర్ వర్థంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

## -బండి హరిబాబు, కుమ్మరపాలెం, ఆత్మకూరు గ్రామం

ఉలవపాడు, జనవరి :-17



కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు క్రీ"శే నందమూరి తారక రామారావు 29 వర్ధంతి సందర్బంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించబడును. అందులో భాగంగా నేడు వెంగమాంబ ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు జరుగు మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని బండి హరిబాబు కుమ్మరిపాలెం తెలుగుదేశం పార్టీ సినియర్ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనది.

# నేడే స్వచ్ఛ ఆంధ్ర దివాస్ క్యాంపె యిన్

గుడ్లూరు,



స్వచ్ఛ ఆంధ్ర దివాస్ క్యాంపెయిన్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి మాసంలో మూడవ శనివారము నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు తెలిపారు.. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానంగా పారిశుధ్యంపై ప్రజలలో అవగాహన పెంచడం మరియు సమాజంలో పరిశుభ్రతా ప్రమాణాలను పెంపొందించడం,పరిసరాల పరిశుభ్రతపైన మరియు బహిరంగ ప్రదేశాలలోను,ఆవాస ప్రాంతాలలోనూ పాఠశాలలు ఆసుపత్రులు తదితర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడంపై ప్రజలకు అవగాహన కల్పించటం, మురుగు నీటి నిర్వహణ,ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, స్వచ్ఛభారత్ మిషన్‌కు రాష్ట్ర స్థాయిలో అందించిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించడంస్థానిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మరియు విద్యార్థుల తో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయడం అలాగే సామూహిక శ్రమదానం స్థానిక నాయకులు, అధికారులు, మరియు సామాన్య ప్రజలు కలిసి పరిశుభ్రతా పనుల్లో పాల్గొని నిరంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ క్యాంపెయిన్ ద్వారా అన్ని గ్రామ పంచాయతీలలో పర్యావరణ హితమైన జీవనశైలికి ప్రజలు అలవాటు పడేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి మూడవ శనివారము ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోనికి అవగాహన కొరకు తీసుకొని రావడం జరుగుతుంది.

# ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

గుడ్లూరు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమం గుడ్లూరు గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు నిర్వహించబడును. కావున గుడ్లూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి, కార్యకర్తలు నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు కోరారు .

# కొడుకును చంపిన తండ్రి ..

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటలో

కొడుకు రోజు తాగి తల్లిదండ్రులను వేధిస్తున్నాడని, రోజు జులాయి గా తిరిగి వచ్చి మద్యం త్రాగుతూ ఉండేవాడని తల్లిదండ్రులు మందలిస్తే మిమ్మల్ని చంపుతానని అనే వాడని, అర్ధరాత్రి వరకు తండ్రి తో గొడవ పడ్డాడని విసుగు చెందిన తండ్రీ మాదాసు దుర్గయ్య తన కొడుకు మాదాసు శ్రీకాంత్ 29 ను అర్ధరాత్రి నిద్ర పోతుండగా కత్తి తో నరికి చంపి హతమార్చాడు.నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడం జరుగుతుంది

# భార్యను వేట కొడవలితో హత్య చేసిన కసాయిభర్త

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో శుక్రవారం దారుణం జరిగింది. భర్త వెంకటేశ్వర్ రెడ్డి, భార్య పుష్పవతిని వేట కొడవలితో నరికి చంపాడు. దీంతో భార్య పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందింది,వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తతో కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దంపతుల గొడవను పరిష్కరించేందుకు పెద్దలు హేమాద్రి లాడ్జిలో పంచాయితీ పెట్టారు. ఆ సమయంలో భార్యను వెంకటేశ్వర్ రెడ్డి, పక్కకు పిలిచి వేటకొడవలితో దారుణంగా నరికాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె చనిపోయింది. పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

# కంభంలో ప్రమాదాలపై అవగాహన

ప్రకాశంజిల్లా కంభం మండలం ఎస్సై బి. నరసింహారావు ఈరోజు శుక్రవారం కంభం హైవే రోడ్డు వద్ద ఆటోలలో అధిక లోడుతో ప్రయాణిస్తున్న ప్రయాణికుల ఆటోలను ఆపి అధిక లోడుతో ప్రయాణం చేయడం వల్ల కలిగే అనర్థాల గురించి ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, పోలీస్ శాఖ వారికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ముఖ్య కార్యకర్తలు సమావేశానికి వేలాదిగా తరలిరావాలి

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్నెపాక సంజీవ మాదిగ

కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ జనవరి 17

మాదిగ,మాదిగ ఉపకులాల, ఏబిసిడి వర్గీకరణ పోరాటాల కోసం ఈనెల 19న హైదరాబాదులో మేడి పాపన్న,ఆధ్వర్యంలో జరిగే ముఖ్య కార్యకర్త ల సమావేశానికి కదలి రావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్నెపాక సంజీవ మాదిగ అన్నారు. నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మాదిగ మాదిగ ఉపకులాల ఏబిసిడి చట్టబద్ధమైన,డిమాండ్ అని అత్యుత్తమైన న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని, అదేవిధంగా ఆ రోజున శాసనసభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏబిసిడి వర్గీకరణకు పూర్తి మద్దతు ఇస్తున్నామని అన్నారు వర్గీకరణ అమలు కాకముందే ఉద్యోగ నియామకాలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అర్హులైన నిరుపేదలకు ఇందిర ఇండ్లుఇచ్చే విధంగా చూడాలని అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డప్పు చెప్పు వృత్తిదారులకు, 4000 రూపాయల పెన్షన్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహా గర్జనకు గ్రామ గ్రామం నుండి మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ అధికార ప్రతినిధి అందుగుల సీతయ్య, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర ప్రసాద్, సహదేవుడు, చిన్న యాదయ్య,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఏం ఎల్ ఏ దగుమాటి కృష్ణారెడ్డిని కలిసిన స్నేహితులు

కావలి,

కావలి నియోజవర్గ శాసనసభ్యులు దగుమాటి కృష్ణారెడ్డిని ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఆసిఫ్ ఉద్దీన్, ఎం ఎల్ ఏ స్నేహితులు స్వామి దాస్ , నెల్లూరు ప్రకాశం జిల్లాల క్రైమ్ కౌంటర్ దినపత్రిక ఇన్చార్జి కంచర్ల మల్లికార్జునరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకుపూల బొకెలను అందజేశారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహితులు కలవడంతో కుటుంబ విషయాలును చర్చించుకున్నారు. చాలా కాలం తర్వాత కలవడం ఎంతో ఆనందం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# అనధికార బ్యారన్ నిర్మాణాలపై చర్యలు

## -వేలం కేంద్రం ఏయస్ ఎం. కిరణ్

కందుకూరు

కందుకూరు 26వ వేలం నిర్వహణాధికారి యం.కిరణ్ ఆధ్వర్యంలో అనధికార బ్యారన్ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు.వేలం కేంద్రం పరిధిలో గల మండలాలైన పొన్నలూరు,కందుకూరు, జరుగుమల్లి,సింగరాయకొండ మండల తహశీల్దార్ కార్యాలయంలను సందర్శించి 2024-25 సంవత్సర కాలంలో పొగాకు రైతులు చేపట్టిన అనధికార బ్యారన్ల జాబితాను తహశీల్దార్లుకు పంచాయితీ సెక్రటరీ / విఆర్ఓ లకు సమర్పించి పొగాకు బోర్డు వారు అనధికారిక బ్యారన్ నిర్మాణాలపై చేపడుతున్న చర్యలును వివరించి పొగాకు బోర్డ్ వారు అట్టి నిర్మాణాలును నిలువరించేందుకు జారీచేసిన నోటీసును,మహజరునామా కాపీలును అందజేసి రాష్ట్ర ప్రభుత్వ నియమావళిని అనుసరించి అక్రమ బ్యారన్ నిర్మాణాలును నిలువరించే దిశగా తగు చర్యలను చేపట్టవలసినదిగా సూచించారు.

# వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి అభిషేకం పల్లకి సేవ

కందుకూరు,



కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీ శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం జరిగే అభిషేక కార్యక్రమం ఆలయ అర్చకులు అమ్మవారి అభిషేకం వైభవంగా నిర్వహించారు. అభిషేకానంతరం కుంకుమ పూజ, అమ్మవారి అష్టోత్తరం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడ్లదొన సీతారావమ్మ, వెంకటపూర్ణ చందర్రావు ఉభయ దాతలుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. పల్లకి సేవ ముందు పడమటి బలిజపాలెం కోలన్న బృందం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# నకిలీ నియామక పత్రాల పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తం గా వ్యవహరించాలి.....

## - ఏ.కే.యూ రిజిస్ట్రార్ విజ్ఞప్తి.

ఒంగోలు,

నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి,యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్, కళాశాల విద్యా కమిషనర్ తదితరుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పేర్కొంటూ పలువురు గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ నియామక పత్రాలను సృష్టించి ఇటీవల కాలంలో నిరుద్యోగ యువతీ యువకులకు మాయ మాటలు చెప్పి, అమాయకులైన నిరుద్యోగులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంలో నిరుద్యోగ యువతీ యువకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరగలేదని అన్నారు. నకిలీ నియామకాల నుండి నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమ దృష్టికి వచ్చిన నకిలీ నియామక పత్రాల వ్యవహారం పై తగు విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు



# మీనాక్షితో మామూలుగా ఉండదంతే..!

ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన మీనాక్షి చౌదరి ఆ సినిమాతో ఆడియన్స్ ని అలరించగా హిట్ 2 తో పాటు వరుస క్రేజీ ఛాన్స్ లు అందుకుంది తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన మరో కొత్త భామ మీనాక్షి చౌదరి. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన మీనాక్షి చౌదరి ఆ సినిమాతో ఆడియన్స్ ని అలరించగా హిట్ 2 తో పాటు వరుస క్రేజీ ఛాన్స్ లు అందుకుంది. ఓ పక్క యువ హీరోలతో నటిస్తూ స్టార్ సినిమాల్లో కూడా ఛాన్స్ అందుకుంటుంది అమ్మడు. తెలుగులో సూపర్ స్టార్ మహేష్ తో గుంటూరు కారం, కోలీవుడ్ లో దళపతి విజయ్ తో కలిసి నటించిన మీనాక్షి లేటెస్ట్ గా విక్టరీ వెంకటేష్ తో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా సక్సెస్ తో మీనాక్షి పేరు మరోసారి హైలెట్ గా నిలిచింది. మీనాక్షి కేవలం గ్లామర్ పాత్రలే కాకుండా కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తూ వస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకటేష్ ఎక్స్ లవర్ గా చేసిన మీనాక్షి చౌదరి ఒక డెంటల్ డాక్టర్ అని ఎవరికీ తెలియదు. ఆమె ప్రొఫెషనల్ డెంటల్ డాక్టర్ అని రీసెంట్ ఇంటర్వ్యూలో వెల్లడించింది. అంతేకాదు 2018 లో ఫెమినా మిస్ ఇండియా పోటీలో కూడా హర్యానా నుంచి వచ్చిన అమ్మడు మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ టైటిల్ గెలుచుకుంది. ఇక అమ్మడు ప్రతి ఒక్కరు జీవితంలో హార్డ్ వర్క్, డిసిప్లేన్ ఈ రెండు పాటిస్తే కచ్చితంగా సక్సెస్ వస్తుందని అంటుంది మీనాక్షి. అంతేకాదు ప్రతి విషయంలో మన పద్ధతి అవతల వారికి ఎలా ఉందో అన్నది చూసుకోవాలని అంటుంది. ఫీల్డ్ ఏదైనా సరే ఇవి పాటిస్తే సక్సెస్ అందుకుంటామని అన్నది. ఇక చిన్నప్పటి నుంచి డాక్టర్, మిస్ ఇండియా కోరికలు నెరవేరాయని.. ఐతే సివిల్ సర్వెంట్ అవ్వాలని ఉండేదని కూడా చెప్పుకొచ్చింది అమ్మడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న అమ్మడు కెరీర్ లో ఇప్పుడు మరింత జాగ్రత్త పడాలని చూస్తుంది. మీనాక్షికి రాబోతున్న సినిమాలతో కూడా ఇదే లక్ కొనసాగితే తప్పకుండా అమ్మడు కూడా టాప్ లీగ్ లోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. మీనాక్షికి వచ్చిన ఈ లక్కీ ఛాన్స్ ని పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకుంటే మాత్రం నిజంగానే తెలుగులో ఒక రేంజ్ కి వెళ్లే ఛాన్స్ ఉంటుంది



## మరో క్రేజీ సీక్వెల్‌లో మృణాల్..

తెలుగు సినిమాల్లో ఇటీవల క్రేజీ ఆఫర్స్ అందుకొని ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన స్థాయిని పెంచుకుంటోంది తెలుగు సినిమాల్లో ఇటీవల క్రేజీ ఆఫర్స్ అందుకొని ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన స్థాయిని పెంచుకుంటోంది. దుల్కర్ సల్మాన్ సరసన 'సీతారామం'లో నటించిన మృణాల్ సాలీడ్ సక్సెస్ సాధించిన తరువాత బాలీవుడ్ వైపు మరింత దృష్టి పెట్టింది. ఓ వైపు తెలుగులో చేస్తూనే నార్త్ లోను బిజీ అవ్వాలని అనుకుంది. తెలుగులో చివరగా ఫ్యామిలీ స్టార్ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. పరశురామ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా డిజాస్టర్ అయ్యింది. అనంతరం పాన్ ఇండియా మూవీ కల్కిలో ఒక స్పెషల్ పాత్రతో మెప్పించింది. ఇక మళ్ళీ కొంత కాలం అనంతరం కొన్ని కథలు విన్నప్పటికి పెద్దగా నచ్చలేదట. రీసెంట్ గా అడివి శేష్ తో డెకాయిట్ సినిమాకు ఓకే చెప్పింది. అలాగే ప్రస్తుతం ప్రభాస్ లైనప్ లో ఉన్న ఒక సినిమాలో ఛాన్స్ దక్కే అవకాశం ఉన్నట్లు రూమర్స్ వస్తున్నాయి కానీ ఇంకా సరైన క్లారిటీ రాలేదు. ఇక లేటెస్ట్ గా, మృణాల్ ఠాకూర్ మరో బిగ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అజయ్ దేవగణ్ నటించిన బ్లాక్ బస్టర్ హిట్ 'సన్ ఆఫ్ సర్దార్'కి సీక్వెల్ రూపొందనుంది, ఇందులో మృణాల్ ప్రధాన పాత్రలో నటించనుందట. 2012లో విడుదలైన 'సన్ ఆఫ్ సర్దార్' తెలుగులో సూపర్ హిట్ అయిన 'మర్యాద రామన్న'కు రీమేక్‌గా తెరకెక్కింది. అజయ్ దేవగణ్ నటనతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ రూపొందించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. అజయ్ దేవగణ్ తన గత పాత్రను తిరిగి చేస్తుండగా, ఈ సీక్వెల్‌లో కథలో కొత్త పంథా, కొత్త పాత్రలను చేరుస్తున్నారు. ఫస్ట్ పార్ట్ లో నటించిన సోనాక్షి సిన్హాను కాదని ఈసారి మృణాల్ ఠాకూర్ ని ఫైనల్ చేసే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. లిస్టులోకి మృణాల్ పేరు రాగానే సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. మృణాల్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తోంది. 'సూపర్ 30,' 'జెర్సీ' వంటి చిత్రాలతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందిన మృణాల్, ఇప్పుడు అజయ్ దేవగణ్‌తో కలిసి నటించడం తన కెరీర్‌కి పెద్ద టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని చెప్పవచ్చు. తన ప్రతి పాత్రలో కొత్తదనాన్ని చూపిస్తూ, బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటోంది మృణాల్. సీక్వెల్ కథను మరింత కామెడీ ట్విస్ట్ లతో మిక్స్ చేయనున్న మేకర్స్ త్వరలోనే కీలక అప్డేట్ ఇవ్వనున్నారు. గత సినిమాను మించి ఈసారి కథలో కొత్త మలుపులు, వినోదం, కుటుంబ అనుబంధాలు పుష్కలంగా ఉంటాయని సమాచారం. చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ చిత్రం 2025 జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను అందుకుంటుందో చూడాలి.

# హరిహర వీరమల్లు' నుంచి ఫస్ట్ సింగిల్ వచ్చేసింది!

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ దర్శకత్వం వస్తున్న తాజా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ మూవీలోని ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అంటూ సాగే పాటను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. కాగా, ఈ పాటను పవన్ పాడడం విశేషం. తాజాగా విడుదలైన సాంగ్‌లో వీరమల్లు మాట వినాలి... అంటూ పవన్ గొంతు మరోసారి అందరిలో జోష్ నింపడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పాటను ఈ నెల 6న విడుదల చేస్తామని గతంలో మేకర్స్ ప్రకటించారు. కానీ, వాయిదా పడింది. సంక్రాంతి కానుకగా 14న సాంగ్ ప్రోమోను రిలీజ్ చేసిన చిత్ర బృందం, పూర్తి పాటను ఈ నెల 17న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక గతంలో నాలుగైదు చిత్రాల్లో పాటలు పాడిన పవన్ మళ్లీ చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాలో పాట పాడడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. పవన్ సరసన హీరోయిన్‌గా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఈ మూవీకి ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. మార్చి 28న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది




# మత్తు కళ్లతో కవ్విస్తున్న శ్రీలీల

తాజాగా మరో అందమైన ఫోటోను సోషల్ మీడియా ద్వారా అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ సినిమా నిరాశ పరచినా అనూహ్యంగా ఈ అమ్మడికి స్టార్ డం దక్కింది. తెలుగులో ప్రస్తుతం టాప్ స్టార్ హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా శ్రీలీల దూసుకు పోతుంది. గత ఏడాది ఈ అమ్మడి నుంచి వచ్చిన సినిమాల్లో గుంటూరు కారం నిరాశ పరిచింది. ఈ ఏడాది పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ అభిమానులు ఈమె ఫోటోలను తెగ షేర్ చేస్తూ ఉంటారు. తాజాగా మరో అందమైన ఫోటోను సోషల్ మీడియా ద్వారా అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. ఈసారి శ్రీలీల డెనిమ్ షార్ట్ ధరించి మత్తు కళ్లతో కవ్వించే విధంగా చూస్తోంది. సింపుల్ అండ్ క్యూట్ లుక్‌లోనూ శ్రీలీల చూపు తిప్పుకోనివ్వడం లేదు. సాధారణంగా హీరోయిన్స్ మేకప్ లేకుండా చూడలేం. కానీ శ్రీలీల ఇలా కూడా చాలా అందంగా ఉందని, హెయిర్ డ్రెస్ చేయకున్నా చాలా అందంగా ఉంది అంటూ ఫ్యాన్స్ మరోసారి ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ స్థాయి అందం ప్రస్తుతం ఉన్న హీరోయిన్స్‌లో కేవలం శ్రీలీలకే సాధ్యం అంటూ ఆమె ఫ్యాన్స్‌లో కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ముందు ముందు ఈ అమ్మడి అందాల ఆరబోతకు మరిన్ని పెద్ద సినిమాల్లో హీరోయిన్స్ ఛాన్స్ దక్కవచ్చు అంటూ సినీ విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం ఈమె సినిమాల జాబితా తీస్తే చాలా పెద్దగానే ఉంది. నితిన్‌తో నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో వైపు నవీన్ పొలిశెట్టి సినిమాలో నటిస్తోంది. ఇక అత్యంత ముఖ్యంగా విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఒక భారీ సినిమాలోనూ శ్రీలీల నటిస్తోంది. ఈమధ్య కాలంలో విజయ్ దేవరకొండతో నటించేందుకు పలువురు యంగ్ హీరోయిన్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఆ అవకాశం శ్రీలీలకు దక్కింది. ఈ సినిమాలో రష్మిక మందన్న కీలక పాత్రలో కొంత సమయం కనిపించబోతుందని తెలుస్తోంది. అయినా శ్రీలీల మెయిన్ లీడ్‌గా సినిమాలో కనిపించబోతుందని సమాచారం అందుతోంది. ఇంకా శ్రీలీల నటిస్తున్న సినిమాలు, నటించబోతున్న సినిమాలు, కమిట్ అయిన సినిమాలు, చర్చలు జరుగుతున్న సినిమాలు చాలానే ఉన్నాయి. వాటిల్లో ఈ ఏడాది కనీసం అయిదు లేదా ఆరు వస్తాయని అంటున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శ్రీలీల వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. రాబోయే రోజుల్లో వారి కాంబోలో మరిన్ని సినిమాలను శ్రీలీల చేసే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న సినిమాల్లో నటిస్తున్న కారణంగా శ్రీలీల పారితోషికం సైతం భారీగానే డిమాండ్ చేస్తుంది. కిస్సిక్ సాంగ్ కోసం దాదాపు రెండు కోట్ల పారితోషికంను శ్రీలీల అందుకుంది. హీరోయిన్‌గా నటిస్తే అంతకు మించి పారితోషికం అందుకుంటూ ఉందట



PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918